# సింగిల్ పేజీ కథ

# సుఖాంతం

**పార్కులో సిమెంటు బెంచీ మీద కూర్చుని పడమటకి కృంగిపోతున్న సూర్యుడినే తదేకంగా చూస్తున్నాడు నిరంజనరావు.**

మనసుని ఆలోచనల మేఘాలు కమ్మేస్తున్నాయి.

రెండు రోజుల క్రితం డ్వాకరు చెప్పిన మాటలే చెవుల్లో గిర్రున తిరుగుతున్నాయి.

వారం రోజులుగా కొడుకు దగ్గరుండి చేయించిన టెస్టుల రిపోర్టులు చూసి డ్వాక్టర్ చెప్పాడు తనకి వచ్చిన జబ్బేమిటో!

''మీ నాన్నగారి కిడ్నీస్ రెండూ చాలా భాగం చెడిపోయాయి. అవి శక్తిని క్రమంగా కోల్పోతున్నాయి. పూర్తిగా చెడిపోతే ప్రాణానికే ప్రమాదం. త్వరలోనే ఆపరేషన్ చేయించి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలి. ఎవరైనా కిడ్నీ డొనేట్ చేసే వాళ్లు కావాలి''

తనకి కిడ్నీని దానం చేయడానికి కొడుకూ, కోడలూ ముందుకి వచ్చేరు.

ఆ తర్వాత చెప్పాడు డ్వాక్టర్ అసలు విషయం.

''ఈ ఆపరేషన్ చాలా ఖర్చుతో కూడుకున్నది. కిడ్నీ దానం చేసే వాళ్లు దొరికినా ఆపరేషన్ కయ్యే ఖర్చు లక్ష రూపాయలదాకా ఉంటుంది''

అకాల వార్ధక్యం మీద పడినట్లు కృంగిపోయాడు కొడుకు ఆ మాటలకి.

లక్ష రూపాయలంటే తమలాంటి మధ్య తరగతి వాళ్లు కళ్లతో కూడా చూసి ఉండని డబ్బు!

''నాల్గైదు రోజుల్లో డబ్బు సర్దుబాటు చేసుకుని వస్తాము'' అని చెప్పి బయటకి వచ్చేశారు.

ఇంటికి వస్తుంటే కొడుకూ, కోడలూ తలెత్తి తన ముఖంలోకి సూటిగా చూడలేకపోయారు. తను మాత్రం ఏదో తప్పు చేసినట్లు అపరాధ భావంతో కుంచించుకుపోయాడు.

అప్పటి నుంచీ మొదలయింది... నిశ్చల సరోవరంలా ఉన్న తన మనసులో.. ఎవరో రాయి విసిరినట్లు అలజడి!

పార్కులోంచి బయటకి వెళ్లిపోవాలని లేచి వచ్చేశాడు గానీ... ఇంటికి వెళ్లాలంటే మనస్కరించడం లేదు.

ఒక్కరోజులో తన జీవన విధానంలో ఎంత మార్పు వచ్చేసిందో తలుచుకుంటే ఆయనకే ఆశ్చర్యంగా ఉంది.

సంతోషం అంటే బాధల్లేకపోవడమే.. సుఖం అంటే కష్టాలు లేకపోవడమే.. అన్నట్లుగా హాయిగా బ్రతికేశాడు ఇన్నాళ్లూ.

తమ ఇంట్లో ఉండేది ముగ్గురు మనుషులే అయినా ఎంతో సందడిగా ఉంటుంది ఇల్లు. కొడుకు ఇంట్లో లేకపోయినా కోడలు ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటుంది. రాజకీయాల గురించో, పత్రికల్లో వచ్చే సాహిత్యం గురించో ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది.

అలాంటిది ఇంట్లో ఈ రెండు రోజుల నుంచీ నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆ నిశ్శబ్దమే భరించలేనట్లుగా ఉంది నిరంజనరావుకి.

ఆలోచనల్లో ఉండగానే ఇల్లు వచ్చేసింది.

తల వంచుకుని ఇంట్లోకి నడిచాడు.

కోడలు తాగడానికి మంచినీళ్లిచ్చింది.

కాళ్లు కడుక్కుంటే తువ్వాలు అందించింది.

వంటింట్లో పీట వాల్చి డ్వాక్టరు చెప్పిన పత్యం ప్రకారం భోజనం వడ్డించింది.

అంతా మరబొమ్మలు ఆడుతున్నట్లుగా జరిగిపోతోంది.

ఎవరూ పెదవి విప్పడం లేదు. పెదవి విప్పితే ఏం మట్లాడవలసి వస్తుందో అన్న భయం.

కోడలు ఇచ్చిన టాబ్లెట్లని మౌనంగా అందుకుని మింగేశాడు.

అంతా ఉరి తీయబోయే ఖైదీకి జరిగే మర్యాదల్లా చకచకా జరిగిపోతున్నాయి.

నిద్ర రాకపోయినా సరే తన గదిలోకి చేరి లైటార్పేసుకుని దుప్పటి కప్పుకున్నాడు నిరంజనరావు.

చుట్టూ ముసురుకున్న చీకటిలా... మళ్లీ ఆలోచనలు!

చావు గురించి ఆలోచించడం కన్నా భయంకరమైన శిక్ష మరొకటుండదేమో... అందులోనూ కచ్చితంగా చనిపోయే రోజు సమీపిస్తోందని తెలిసినప్పుడు.

★ ★ ★

''వెళ్లిన పనేమయిందండీ? ఏమైనా ఆశ ఉందంటారా?'' అర్ధరాత్రి ఇంటికి వచ్చిన భర్తని అడిగింది విశాల.

పక్క గదిలో పడుకున్న మామగారికి వినపడుతుందేమోనన్న భయంతో నెమ్మదిగా మాట్లాడుతోంది. అయినా వాళ్ల మాటలు వినపడుతూనే ఉన్నాయి నిరంజనరావుకి.

''మనలాంటి మధ్యతరగతి వాళ్లకి లక్ష రూపాయలు కావాలంటే ఎవరిస్తారు? నాకొచ్చే జీతం అంత డబ్బుకి వడ్డీ కట్టడానికే సరిగ్గా సరిపోదు. ఇంక నేను అప్పు తీర్చగలనని వాళ్లెలా నమ్ముతారు?'' బాధగా అన్నాడు శ్రీధర్.

''అలాగంటే ఎలాగండీ? మావయ్యని చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఆయనతో తలెత్తి సూటిగా చూసి మాట్లాడలేక పోతున్నాను. ఆయనే ఏదో తప్పు చేసినట్లుగా తల దించుకుంటుంటే నాకు తల తీసేసినట్లుగా ఉందండీ'' ఆవేదనగా అంది విశాల.

''నిజమే... ఈ లోకంలో నయంకాని జబ్బులెన్నో ఉన్నాయి. కానీ నాన్నకొచ్చిన జబ్బు నయం చేయగలిగేదే అని, ఆపరేషన్ చేయిస్తే ఆయన ఆరోగ్యం కుదుటపడుతుందని తెలిసి కూడా చూస్తూ చూస్తూ ఆయన్ని మృత్యువుకి అప్పగించాల్సి వస్తోంది. నేనెంత కుమిలిపోతున్నానో నీకు తెలియదు.''

''పోనీ మీ ఆఫీసులో అడగలేకపోయారా ఏమైనా లోన్ ఇస్తారేమో'' ఆశగా అంది.

''అదీ అయింది... విషయం చెప్పి మా ఆఫీసర్ని అడిగాను లోన్ ఇప్పించమని''

''ఏమన్నారు?''

''అంత పెద్ద మొత్తం వీలు పడదన్నారు. ఇంకా ఏమన్నారో తెలుసా... నాన్న వయసుడిగిపోయిన మనిషి... ఇవాళ కాకపోయినా రేపయినా పోవాల్సిందే. సర్వీసయిపోయిన బండి మీద అంత పెట్టుబడి పెట్టడం వృధాట... పిచ్చి సెంటిమెంట్లతో కిడ్నీ దానం చేసి నా ప్రాణం మీదకి తెచ్చుకోవద్దన్నారు''

''ఏవండీ..'' బాధగా అంది విశాల.

''అవును విశాలా... మధ్యతరగతి అనుబంధాలన్నా మన ప్రాణాలన్నా వాళ్లకంత చులకన. వాళ్లకేం అర్థమవుతుంది నాన్నతో నాకున్న అనుబంధం?'' ఆవేశంగా అన్నాడు శ్రీధర్.

''ష్... నెమ్మదిగా మాట్లాడండి.. మావయ్యగారు వింటే బాధపడతారు'' అంది విశాల.

నిరంజనరావు ఇంక వినలేకపోయాడు వాళ్ల మాటలని.

రచయితగా తను ఎన్నో కథలు రాశాడు.

సెంటిమెంట్లని పండించాడు.

తన జీవిత కథలో విధాత ఇంత విషాధాన్ని ఒలికిస్తాడని ఊహించలేకపోయాడు.

ఆయనలో కసి పెరగసాగింది.

ఏం చేస్తే తన కొడుకు బాధని తొలగించగలడు?

ఆలోచిస్తుంటే ఆయనకొక ఉపాయం తట్టింది.

తన కథనా మలుపు తిప్పితే?

ఆ ఆలోచన వచ్చాక ఇంక స్థిమితంగా ఉండలేక పోయాడు.

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజు నిరంజనరావు పార్కు నుంచి వచ్చేస రికి విశాల ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

చాలా రోజుల తరువాత ఆమె నోరు విప్పి మాట్లాడింది.

''మొన్న మీరెళ్లిన డాక్టరుగారు ఆయన ఆఫీస్‌కి ఫోన్ చేశారుట. మీ టెస్టుల తాలూకు రిపోర్టులు మారినట్లు అనుమానంగా ఉందని రమ్మన్నా రుట'' అంది ఆయన్ని చూడగానే.

మళ్లీ కొడుకుతో కలిసి డాక్టరు దగ్గరికె ళ్లడం... ఆయన నిరంజనరావుకి ఏ జబ్బూ లేదని తేల్చి చెప్పడం... అంతా కలలోలా జరిగిపోయింది.

ఇలాంటి అద్భుతం జరుగుతుందని కలలో కూడా ఊహించని శ్రీధర్ ఆనందంతో చిన్నపిల్లా డైపోయాడు.

ఆనందంగా ఇంటికొచ్చి విశాలతో చెప్పారు.

మోడువారిపోయిన చెట్టుకి ఆకులు వచ్చినట్లు ఆ ఇంట్లో మళ్లీ మాటలు చిగురించాయి.. నవ్వులు పూసాయి.

సంతోషం కన్నా 'తిరిగి సాధించుకున్న సంతోషం' మరింత గొప్పగా ఉంటుంది... ఆ సంబరంలో అంతా తేలిపోయారు.

నిరంజనరావు హాయిగా ఊపిరి పీల్చుకు న్నాడు.

★ ★ ★

ఆ తర్వాత ఆరు నెలలకే నిరంజనరావు హఠా త్తుగా మరణించాడు.

''కాలం తీరిపోయింది. వెళ్లిపోయాడు'' అను కున్నారంతా.

పై లోకంలో నిరంజనరావు మాత్రం తృప్తిగా నవ్వుకున్నాడు. డాక్టరుతో తను ఆడించిన చిన్న అబద్ధం తండ్రిని కాపాడుకోలేకపోయానన్న ఆత్మ న్యూనతా భావం నుంచి కొడుకుని జీవితాంతం కాపాడగలిగింది. ఇన్నాళ్లూ ఆనందమయంగా సాగిన తన జీవిత కథని దుఃఖాంతం కాకుండా కాపా డగలిగింది.

**-ఆకునూరి మురళీకృష్ణ**
**(భువనేశ్వర్)**

# జాతకం

మృత్యుంజయశాస్త్రిగారి గురించి విన్నది నేను నమ్మలేకపోయాను. ఆయన గొప్ప రచయిత, కవి, నాటక రచయిత. అనేక కథలు, నవలలు రాసి ఆంధ్రదేశమంతా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. కొన్ని కథలకు ప్రముఖ వారపత్రికలు శాస్త్రిగారికి బహుమ తులూ ఇచ్చేయి. ఆయన సెంట్రల్ గవర్నమెం ట్‌లో ఉన్నతోద్యోగం చేసి రిటైరయ్యారు. సాధారణంగా సర్వీసులో ఉండగా రచయితలు తమ పూర్తి కాలాన్ని రచనల మీద వినియోగిం చడానికి కుదరదు. ఆఫీసు పని వత్తిడి దానికి ముఖ్య కారణం. అటువంటి వారు పదవీ విర మణని ఒక వరంగా తీసుకుని తమ పూర్తి కాలాన్ని రచనా వ్యాసంగం మీదకు మళ్లిస్తారు. శాస్త్రిగారి విషయంలోను అందరూ అదే ఆశించారు.

శాస్త్రిగారు రిటైరయ్యాక అందరూ ఊహించినట్టుగా రచనా వ్యాసంగాన్ని చేపట్ట లేదు. మరి ఏం చేస్తారు? ఆయన చిన్నప్పటి నుంచి అనేక శాస్త్రాలను అభ్యసించేరు. వారికి సంస్కృతంలోనూ మంచి పట్టున్నది. మంత్ర శాస్త్రం, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడం వారికిష్టమైనవే. కానీ వారికి జ్యోతిషశాస్త్రం తెలుసునని చాలామందికి తెలియదు. జ్యోతిష శాస్త్రం తెలియడమే కాదు అందులో వారు చాలా కృషి చేశారని, నిష్ణాతులయ్యారని తర్వాత తర్వాత తెలిసింది.

శాస్త్రిగారు రిటైరయిన మరునాడే వారి ఇంటి కాంపౌండు గోడకి 'దైవజ్ఞ' జె.మృత్యుం జయశాస్త్రి అనే నేమ్‌బోర్డు తగిలించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. పెళ్లిళ్లకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు పెట్టడం, వాస్తు చూడటం, జాతకాలు రాయడం మొద లైనవి అన్నీ చేయడం ప్రారంభించేరు. నేనూ రెండు మూడు సార్లు ఆయన్నీ విషయాలపై సంప్రదించేను. మా సంభాషణల్లో జ్యోతిషం మీద వారు చెప్పేవి చాలా ఆసక్తికరంగా ఉండేవి. అడిగేవారి ఇబ్బందులనర్థం చేసుకుని పట్టువి డుపులు ప్రదర్శిస్తూ అందర్నీ తొందర్లోనే ఆక ట్టుకున్నారు. అన్నీ ఉచితంగానే చెప్పడం వారి ప్రత్యేకత.

జ్యోతిషంపై కొన్ని పత్రికలకు వ్యాసాలు రాశారు. ప్రతి ఉగాదికి పంచాంగ పఠనం, రెండు మూడు చోట్ల శాస్త్రిగారి ముఖ్య కార్య క్రమం. అలాగే ఈ 'తారణ' నామ సంవత్సరం లోనూ శాస్త్రిగారి పంచాంగ శ్రవణానికి వారు చెప్పే మూడు సంస్థలతోనూ నాకు అను బంధం ఉన్న దృష్ట్యా మూడుచోట్లకు నేనూ వెళ్లాను.

పంచాంగ శ్రవణంలో కొత్త సంవత్సరంలో సంభవించబోయే దేశ కాల ఫలాలతో పాటు వ్యక్తి జన్మ నక్షత్రానికి అనుగుణంగా రాశిఫ లాలు, కందాయఫలాలు మొదలైనవి వివరంగా చెబుతారు. శాస్త్రిగారు ఈసారి చెప్పేరు. కానీ ఈసారి వారు చెప్పిన ఒక విషయం చాలా విచి త్రంగా కనిపించింది. నాకు మేష, వృషభ, మిధున, కర్కాటక, సింహ, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సు, మకర, కుంభ, మీన అన్ని రాశులవారికి పూర్తి శుభాలే చేకూరుతాయని చెప్పేరు. ఇది నన్నెంతో ఆశ్చర్యపరచింది. ఎంత ఆలోచించినా దీనికి తగిన సమాధానం నాకు దొరకలేదు.

ఉగాది అయిన నాలుగయిదు రోజులకే శాస్త్రిగారికి తీవ్ర అస్వస్థత కలిగింది. పంచాంగ పఠనంతో అలిసిపోవడం, అనుకున్నది కాక పోగా, కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లాల్సి వచ్చింది. గుండె పోటుగా వాళ్లు నిర్ధా రించి ఐ.సి.సి.యు.లో పెట్టారు. ఇది విని అక్కడే వారిని చూసి వచ్చేను. పరిస్థితి విష మించడంతో హైదరాబాద్‌లోని మరో పెద్ద హాస్పిటల్‌కు మార్చారు.

మరో పది రోజుల్లో పిడుగులాంటి వార్త తెలిసింది. శాస్త్రిగారు మరి లేరు. సంతాప సభ అయ్యాక జ్యోతిషంలో కొంత ఎక్కువ పరిచయమున్న నా స్నేహితుని శాస్త్రిగారి ఈ సంవత్సరపు పంచాంగ పఠనం గురించి అడి గేను. ''కొన్ని రాశులవారికి శుభాలు, మరి కొన్ని రాశులవారికి అశుభాలు ఉంటాయి. కానీ శాస్త్రిగారు ఈసారి అన్ని రాశుల వారికీ శుభపరిణామాలనే చెప్పారు. ఎందువలన?''

''అవును. ఈ విషయం నేనూ విన్నాను'' అని ఊరుకున్నాడు.

''జ్యోతిషశాస్త్రంలో నిష్ణాతులైన శాస్త్రిగా రికి తన రాశి దుష్పరిణామాలు తెలియవా?''

''ఎందుకు తెలియవు? తెలుసును.''

''మరి?''

''మీ అనుమానానికి సమాధానం దాదాపు మీరే చెబుతున్నారు''

నా అయోమయం మరింత పెరిగింది. ''నేనడిగేదేమిటి, మీరు చెప్పేదేమిటి?'' కొద్దిగా గద్దించానని చెప్పాలి.

''అదేనండీ.. మహాశయా! తన రాశి వారికి ఈ సంవత్సరం జరగబోయే దుష్పరిణా మాలు, తాను రాహుగ్రస్తుడన్నీ శాస్త్రిగారికి తెలుసు. కానీ వాటిని ఆయన జీర్ణించుకునే స్థితిలో లేరు. అందుకే పంచాంగ పఠనంలో అన్ని రాశులవారికీ (తనతో సహా) శుభపరిణా మాలనే చెప్పారు!''

నాకీసారి సరైన సమాధానం దొరికింది!

**-కొట్టి రామారావు**
**(మచిలీపట్నం)**